క్లుప్తంగా

శ్రీ మహాలక్ష్మిగా అమ్మవారి దర్శనం



అజ్జాడలో అమ్మవారిని శ్రీ మహాలక్ష్మి అవతారంలో అలంకరించి పూజలు చేస్తున్న భక్తులు

బలిజిపేట: మండలంలోని అజ్జాడలో శ్రీ విజయదుర్గా భవాని ఆలయంలో అమ్మవారిని శ్రీ మహాలక్ష్మి అవతారంలో అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని కొత్త నోట్లతో దండతో వేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ మహాలక్ష్మి అవతారంలో ఉన్న అమ్మవారికి మహిళలతో అర్చకుడు బి.రామలింగస్వామి ప్రత్యేక పూజలు చేయించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం సబ్‌స్టేషన్ పరిధి బందలుప్పి 11కేవీ ఫీడర్లపై విద్యుత్ సరఫరా జరుగుతున్న హెచ్ కారాడవలస, పెదబొండపల్లి, పుట్టూరు, సూడిగాం ప్రాంతాలకు శనివారం ఉదయం 8:30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు గ్రామీణ ప్రాంత విద్యుత్ శాఖ ఏఈ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్న కారణంగా పైన తెలిపిన ప్రాంతాల్లో గల వినియోగదారులు సహకరించాలని కోరారు.

30న మెగా రక్తదాన శిబిరం



డా.డి.రామ్మోహనరావు

పార్వతీపురం: పట్టణంలోని కర్షక మహర్షి ఆస్పత్రిలో ఈనెల 30న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా.ద్వారపురెడ్డి రామ్మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రి డైరెక్టర్ డి.పృథ్వీమోహన్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించనున్న ఈ రక్తదాన శిబిరంలో యువత పాల్గొనాలని కోరారు. ఆపదలో ఉన్న వారికి, ప్రమాదంలో గాయపడిన వారికి, అత్యవసర పరిస్థితుల్లో రక్తం లేని వారికి ప్రాణాలు దక్కాలంటే రక్తదానం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆయన పేర్కొన్నారు.

కోటదుర్గమ్మ ఆలయంలో అన్నసమారాధన



భక్తులకు ప్రసాదాన్ని వడ్డిస్తున్న రంగునాయుడు

మక్కువ: స్థానిక దిగువవీది కోటదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు కోటదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించి, భక్తులకు ప్రసాదం వడ్డించారు.

సమయపాలన కచ్చితంగా పాటించాలి



తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ డా.ఆర్.వైశాలి

పార్వతీపురం రూరల్: రెవెన్యూ సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటిస్తూ ప్రజలకు, అర్జీదారులకు ఉత్తమ సేవలు అందించాలని పార్వతీపురం సబ్‌కలెక్టర్ డా.ఆర్.వైశాలి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె స్థానిక పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అందుబాటులో ఉన్న సిబ్బందితో సమీక్షించారు. అలాగే కార్యాలయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సిబ్బందికి సూచించారు.

ఉపాధి శిక్షణ సంస్థ స్థల పరిశీలన

పార్వతీపురం రూరల్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) నిర్మాణ స్థలాన్ని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శుక్రవారం పార్వతీపురం మండలంలోని కొత్తవలసలో నిర్మాణం కోసం లీజు ప్రాతిపదికన భూమిని కేటాయించేందుకు స్థలాన్ని మండల సిబ్బందితో కలిసి పరిశీలించారు. జిల్లా యంత్రాంగం సంకల్పించిన నిర్ణయం మేరకు నిర్మాణ స్థల కేటాయింపుపై రెవెన్యూ, సర్వే సిబ్బందితో కలిసి పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

సీసీఆర్ కార్డుల జారీలో జాప్యం

కౌలు రైతులకు శాపం

- అన్నదాత సుఖీభవకు దూరమేనా?



కౌలు రైతు పండిస్తున్న పంట

బలిజిపేట: పంటలు సాగుచేస్తున్న కౌలు రైతులను కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకానికి దూరం చేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతుకు సీసీఆర్ కార్డు(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు) ఒక వరం. ప్రభుత్వం రైతులకు ఇచ్చే అన్ని రాయితీలు పొందడానికి, ధాన్యం విక్రయించడానికి, బ్యాంకు రుణాలు పొందడానికి విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాల రాయితీ పొందడానికి సీసీఆర్ కార్డులు కౌలు రైతులకు ఎంతో ఉపయోగ పడనున్నాయి. అటువంటి కార్డుల జారీలో కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తూ రైతులను కష్టాల కడలిలోకి నెడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అన్నదాత సుఖీభవ కొంతమంది రైతులకు వర్తింపచేశారు. రైతులకు అవసరమైన అన్ని రాయితీలు పొందే సమయం పూర్తవుతున్నా ఇంకా సీసీఆర్ కార్డుల జారీలో జాప్యం చేయడం దారుణంగా ఉందని కౌలురైతులు విమర్శిస్తున్నారు. అసలు కౌలు రైతు అనేవాడు ఉన్నాడని ప్రభుత్వం గుర్తిస్తుందా? లేదా ? అనేది ప్రశ్నార్థకంగా ఉందని ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయారు. రబీ సీజన్‌కు అయినా వారికి న్యాయం జరుగుతుందా అనేది చర్చనీయాంశమైంది.

కూటమి ఏడాది పాలనలో..

అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇస్తామని కూటమి ప్రభుత్వం రైతులకు హామీ ఇచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సర కాలం దాటిన తరువాత అరకొరగా కొంతమంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపచేసి చేతులు దులుపుకుంది. కౌలురైతుల విషయంలో ఇప్పటికీ ఈ పథకం వర్తింపచేయలేదు. సీసీఆర్ కార్డులు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వంలో కౌలు రైతులకు భరోసా

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 5సంవత్సరాల కాలంలో 4,320మంది కౌలురైతులకు సీసీ కార్డులు జారీచేశారు. రైతులతో పాటు కౌలుదారులకు సమానంగా రూ.13,500 మొత్తాన్ని రైతు భరోసా రూపంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసింది. రైతులకు అందించే ప్రతి సంక్షేమాన్ని కౌలురైతులకు వర్తింజేస్తూ వారిని అన్ని విధాలా ఆదుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కౌలు రైతులకు ఇప్పటికీ ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు.

1030మంది దరఖాస్తులు

బలిజిపేట మండలంలో 1,300మంది కౌలు రైతులను గుర్తించేందుకు నిర్ధారణ జరిగింది. ప్రక్రియ పూర్తయిన నాటికి 1030మంది మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. వారికి ఇప్పటికీ ఎటువంటి ప్రయోజనం సమకూరలేదు.

గుర్తింపుకార్డులు జారీచేయలేదు

కౌలు రైతులకు సంబంధించిన జాబితాను బ్యాంకులకు అందించాం. అక్కడి నుంచి వాటిని నిబంధనల ప్రకారం సరిచూసి అర్హులైనవారికి రుణసదుపాయం కల్పిస్తారు. దీంతో కౌలు రైతులకు ప్రయోజనాలు సమకూరుతాయి. గుర్తింపుకార్డులు ఇంకా వారికి జారీచేయలేదు.

– శివగణేష్, ఏఓ, బలిజిపేట

మా పరిస్థితి ఏమిటో తెలియడం లేదు

ఖరీఫ్ సీజన్ పూర్తవుతోంది. అయినప్పటికీ కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఇప్పటికీ సీసీఆర్ కార్డులు ఇవ్వలేదు. ఇంతకీ ఎవరికి ఇస్తారో, ఎవరికి ఇవ్వరో తెలియదు. సాగుచేస్తున్న పంటను వదలలేకపోతున్నాం, అలాగని రాయితీలు లేకుండా అన్నీ కొనుగోలు చేసి మదుపులు పెట్టలేకపోతున్నాం. మా మొర విని మాకు త్వరగా సీసీఆర్ కార్డులు అందించాలి.

– సత్యంనాయుడు, రైతు, పలగర, బలిజిపేట మండలం

ఎగ్ ఎమినో యాసిడ్ తయారీ



మిర్తివలసలో యాసిడ్‌ను తయారుచేస్తున్న సిబ్బంది

బలిజిపేట: ఎగ్ ఎమినో యాసిడ్ వినియోగం వల్ల చెట్లకు కావలసిన పోషకాలు, ప్రోటీన్లు లభ్యమవుతాయని ఎంసీఆర్‌పీ లక్ష్మి తెలిపారు. ఈ మేరకు మండలంలోని మిర్తివలసలో శ్రీశ్రీనివాస నేచురల్ బయో ఇన్‌పుట్ సెంటర్ వద్ద ఎంసీఆర్‌పీ లక్ష్మి సమక్షంలో 50లీటర్ల ఎగ్ ఎమినో యాసిడ్‌ను తయారుచేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసిడ్ తయారీకి 20డజన్ల కోడిగుడ్లు, 35లీటర్ల నిమ్మరసం, 6కిలోల బెల్లం వినియోగించాలని చెప్పారు. కోడిగుడ్లను పరిశుభ్రంగా ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములో పేర్చుకుని అవి పూర్తిగా మునిగే వరకు నిమ్మరసాన్ని పోసి రెండు వారాలు మూత పెట్టి ప్రతిరోజూ ఒకసారి మూతను తెరుస్తూ ఉంచాలి. బెల్లాన్ని మిగిలిన నిమ్మరసంతో మురగ పెట్టాలి. 15రోజుల తర్వాత కోడిగుడ్లు పూర్తిగా కరిగిపోతాయి. ఇప్పుడు ఈ రెండు మిశ్రమాలను బాగా కలిపి ఇంకో రెండు వారాలు మూత పెడుతూ రోజుకు ఒకసారి తెరుస్తూ ఉండాలి. తయారీ మొదలు నుంచి నాలుగు వారాల తర్వాత ఎగ్ ఎమినో యాసిడ్ పరిపూర్ణంగా తయారవుతుంది. దీనిని కాయగూరలు, పండ్ల తోటలు, వేరుశనగ, మినుము, మిరప తదితర పంటల్లో ఉపయోగించవచ్చు. ముఖ్యంగా దీనిని గ్రోత్ బూస్టర్‌గా, నాణ్యమైన పూతకోసం పూత నిలబడడానికి, కాయ పెరుగుదలకు వివిధ దశల్లో వినియోగించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరావు, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

శంబర అంగన్వాడీ కేంద్రంలో పోషణమాసం



గర్భిణులకు సీమంతం చేసిన సీడీపీవో అనంతలక్ష్మి, ప్రజాప్రతినిధులు

మక్కువ: మండలంలోని శంబర గ్రామంలో అంగన్వాడీకేంద్రం -4లో శుక్రవారం సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ సింహాచలమమ్మ, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, సీడీపీవో బి.అనంతలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం జరిపించారు. సీడీపీవో అనంతలక్ష్మి కార్యక్రమంలో మాట్లాడుతూ సెప్టెంబర్ 17వతేదీ నుంచి, అక్టోబర్ 16వతేదీ వరకు రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లల పోషణ, రక్షణ విషయంలో తల్లిదండ్రులతో పాటు కుటుంబసభ్యులు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. రక్తహీనత నివారణకు ఐరన్ పుష్కలంగా ఉండే చిరుధాన్యాలు, గుడ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త సూర్యకాంతమ్మ, టాటా ట్రస్ట్ ఎన్‌జీవో ప్రాజెక్ట్ అసోసియేట్ విజయ్, వైద్యసిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రెంటిస్ శిక్షణకు అలాట్‌మెంట్ ఉత్తర్వులు



అలాట్మెంట్ పత్రాలు అందజేస్తున్న జిల్లాఅందజేస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వరరావు

పార్వతీపురంటౌన్:

ఇటీవల ఏపీఎస్ ఆర్టీసీలో ఐటీఐ అప్రెంటిస్ కోసం అప్లై చేసుకున్న అభ్యర్థుల్లో అర్హత మేరకు ఎంపికైన అభ్యర్థులకు అలాట్మెంట్ చేశామని జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యర్థులు పనిపై దృష్టి పెట్టి, శిక్షణను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు జిల్లా ప్రజారవాణాధికారి పి.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పార్వతీపురం మన్యం జిల్లాలో గల డిపోలకు అలాట్‌మెంట్ పత్రాలను అందజేశారు.

మారిషస్ పైనాపిల్‌తో అధిక ఆదాయం

- ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్



మారిషస్ పైనాపిల్ సాగును పరిశీలిస్తున్న పీఓ

సీతంపేట: మారిషస్ పైనాపిల్‌తో అధిక ఆదాయం పొందవచ్చని పాలకొండ సబ్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. మండలంలోని బిల్లగూడ, ఇప్పగూడలో సాగులో ఉన్న మారిషస్ పైనాపిల్ మొక్కలను, స్థానిక హెచ్‌ఎన్‌టీసీ నర్సరీని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. పంటల సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. జీడి, మామిడి పునరుద్ధరణ పథకంలో భాగంగా జీడి, మామిడి సాగు ద్వారా అధిక ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. భామిని మండలం పాలిష్‌కోట, నల్లరాయిగూడ, మనుమకొండ.. సీతంపేట మండలం కీసరజోడు, బిల్లగూడ, ఈతమానుగూడలలో జీడిమామిడిని ప్రయోగాత్మకంగా సాగుచేయనున్నట్లు చెప్పారు. అలాగే మారిషస్ పైనాపిల్ సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌ఓ ఎస్‌వీ గణేష్, హెచ్‌ఓ పేడాడ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

సీతానగరం: తమసమస్యలు పరిష్కరించడానికి చేస్తున్న నిరసన కార్యక్రమానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు పొందుతున్న వారు సహకరించాలని, ప్రభుత్వ పీహెచ్‌సీ వైద్యాధ్యాధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేయాల్సి వస్తోందని పీహెచ్‌సీ డాక్టర్లు విచారం వ్యక్తం చేశారు. రోగులను ఇబ్బందులు పెట్టాలన్న తమ ఉద్దేశం కాదన్నారు. రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించనందుకు శుక్రవారం నుంచి వివిధ స్థాయిల్లో నిరసన కార్యక్రమాలు ప్రారంభించామని పీహెచ్‌సీ వైద్యాధికారుల సంఘం నాయకులు ఒక ప్రకటనలో శుక్రవారం తెలియజేశారు. ఆందోళన షెడ్యూల్‌లో భాగంగా 26న ప్రభుత్వానికి నివేదించాల్సిన ఆన్‌లైన్ రిపోర్టులు నిలిపివేశారు. 27ననిర్వహించలిన్న స్వస్థ్ నారీ సశక్తి కార్యక్రమం, 104 సంచార సేవలు బంద్, 28న అధికారిక వాట్సాప్ గ్రూప్ బహిష్కరణ, 29న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు నిలిపివేస్తారు. 30న నల్లబ్యాడ్జీలతో నిరసన, అక్టోబరు 1న జిల్లాకేంద్రంలో నిరసన, 3వతేదీ నుంచి విజయవాడలో రాష్ట్రస్థాయి నాయకుల నిరాహార దీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

సీతానగరం: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9,11తరగతుల్లో ఖాళీసీట్ల భర్తీకి(లేటరల్ ఎంట్రీ)దరఖాస్తుల స్వీకరణ గడువు అక్టోబరు 7వ తేదీవరకూ పొడిగించినట్లు సంబంధిత అధికారులు తెలియజేశారు. ముందుషెడ్యూల్ ప్రకారం ఈనెల 23వ తేదీతో గడువు ముగిసినప్పటికీ తాజాగా గడువు పెంచుతూ మార్గ దర్శకాలు వచ్చాయని విద్యాలయాలకు సంబంధించిన అధికారులు తెలియజేశారు. విద్యార్థులు 2011 మేనెల1 నుంచి జూలై 31,2013 మధ్య జన్మించి ఉండాలని తెలియజేశారు. పరీక్షలు 2026 ఫిబ్రవరి 7వ తేదీన జరుగుతాయని ప్రకటించారు.

రెండోసారి కాంప్లెక్స్ ఎరువులు వేయకూడదు

గరుగుబిల్లి: ఖరీఫ్‌లో వరిపంటలో రెండో విడత కాంప్లెక్స్ ఎరువులు వేయకూడదని మండల వ్యవసాయాధికారి టి.జ్యోత్స్న అన్నారు. మండలంలో ని గరుగుబిల్లి, పెద్దూరు, గొట్టివలస, తదితర గ్రామాల్లోని వరి పంట పొలాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులను విచక్షణారహితంగా వినియోగిస్తే తెగుళ్లు సోకే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా రెండోసారి భాస్వరం ఎరువు వేయకూడదని సూచించారు. అలాగే మోతాదుకు మించి యూరియా వినియోగించకూడదన్నారు.

పక్కా ఆక్రమణను పట్టించుకోరా?



నారాయణపురంలో శివాలయానికి వెళ్లే రహదారిలో రోడ్డును ఆనుకుని ఉన్న పాక

బలిజిపేట: ఫిర్యాదు మేరకు పక్కా ఆక్రమణ అని తేలింది, నోటీసులు ఇచ్చారు. అయినా ఆక్రమణదారులు చలించలేదు, అయినా ఆక్రమణను తొలగించేందుకు అధికారులు, గ్రామస్థాయి పరిపాలనా అధికారులు ఆరు నెలలకు పైగా మీనమేషాలు లెక్కిస్తున్నారు. సమస్య జిల్లా యంత్రాంగం దృష్టిలో ఉన్నప్పటికీ ఎవరి నెత్తిపై ఉండేదానిని వారు దులుపుకుని పోతున్నారు తప్ప ఆరు నెలలు గడిచినా ఫిర్యాదుదారు సమస్యను పరిష్కరించే సూచనలు కనిపించడం లేదు. ఇదండి మన అధికారుల పనితీరు. నారాయణపురంలో శివాలయానికి వెళ్లే రహదారిలో రోడ్డుకు పక్కాగా ఉన్న కాలువను ఆనుకుని పాకను ఏర్పాటు చేశారు. ఇది ఆక్రమణ స్థలంలో నిర్మించారని దీనిని తొలగించాలని కోరుతూ స్థానికులు ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా గ్రామ కార్యదర్శి స్పందించక పోవడంపై ఫిర్యాదుదారులు ఆవేదన చెందుతున్నారు. ఆక్రమణదారుకు రెండు నోటీసులు ఇచ్చినా ఏమాత్రం చలించకపోయినా సిబ్బంది తదుపరి చర్యలు చేపట్టకపోవడం దారుణమని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. స్థలాన్ని ఎంపీడీఓ శ్రీవాణి పరిశీలించి ఆక్రమణ స్థలంలో ఉన్నందున చర్యలు చేపట్టాలని సూచించారు. దీనిపై గ్రామకార్యదర్శి ఏం చేస్తారనేది చర్చనీయాంశంగా మారింది.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్యసేవలు



పారిశుద్ధ్య కార్మికులకు సేవలందించిన వైద్యులు



స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించిన సీఆర్‌పీఎఫ్ బలగాలు

- స్వచ్ఛతా హి సేవ నిర్వహించిన సీఆర్‌పీఎఫ్ బలగాలు

మక్కువ/సాలూరు: సాలూరు పురపాలకసంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ, సఫాయి మిత్ర సురక్ష శిబిర్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులుకు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, మున్సిపల్ కమిషనర్ టి.రత్నకుమార్ హాజరయ్యారు. సాలూరు వైద్యాధికారులు ప్రియాంక, మాధురి పారిశుద్ధ్య కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యాన్ని పరిక్షించేందుకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలకేంద్రం మక్కువలో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బలగాలు, స్థానిక బీసీకాలనీ, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సక్రమమైన జీవనశైలితో సంపూర్ణ ఆరోగ్యం

- డీఎంహెచ్‌ఓ డా.భాస్కరరావు



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డా.భాస్కరరావు

సీతానగరం: జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీతానగరం మండలంలోని పెదభోగిలిలో జరిగిన స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ వైద్యశిబిరాన్ని తనిఖీ చేసి ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూనె, కొవ్వు, తీపి పదార్థాలు తగ్గించి పోషకాహారాలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు, కేన్సర్ వంటివి దరిచేరవని హితవు పలికారు. ఈనెల 17 నుంచి వచ్చేనెల 2 వరకు కొనసాగే ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా.టి. జగన్‌మోహన్‌రావు, వైద్యాధికారి ఉషారాణి తదితర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మెట్టవలసలో మంచినీటి కష్టాలు

- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంక్



ద్విచక్ర వాహనంపై ప్లాస్టిక్ క్యానుల్లో మంచినీరు తెచ్చుకుంటున్న దృశ్యం

పాచిపెంట:

గిరిజనమంత్రి ఇలాకాలో గిరిజనులకు మంచినీటి కష్టాలు తప్పడం లేదు. గిరిజన ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కరించడానికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నామని చెబుతున్నప్పటికీ, శాశ్వతంగా నీటి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు, గుక్కెడు నీటి కోసం గిరి గ్రామాల ప్రజలకు పుట్టెడు కష్టాలు తప్పడం లేదు. బిందెడు నీటి కోసం మైళ్ల దూరం నడిచి వెళ్తున్నారు. కాలమేదైనా వారికి నీటి కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. పాచిపెంట మండలంలోని పెద్దవలస పంచాయతీ మెట్టవలస గ్రామానికి నెల రోజులుగా రక్షిత మంచినీటి సరఫరా నిలిచిపోయింది. ఉన్న ఒక్క చేతిపంపులో నుంచి ఉప్పునీరు కావడంతో వినియోగానికి పనికి రావడం లేదు. రక్షిత మంచినీటి ట్యాంకుకు నీళ్లు రావడంలేదని, పలుమార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదు, చేసేదేమీ లేక సుమారు రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లి బిందెలతో మంచినీళ్లు తెచ్చుకుంటున్నారు. మరికొందరైతే తమ ద్విచక్ర వాహనాలకు ప్లాస్టిక్ క్యాన్లు ఇరువైపులా కట్టుకుని నీళ్లు తెచ్చుకునే పరిస్థితి, మంచి నీటి కోసం అవస్థలు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై గిరిజన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మంచినీటి కష్టాలు తీర్చేలా మండల అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని గిరిజన ప్రజలు కోరుకుంటున్నారు.

సర్పంచ్ చొరవతో అడారుగెడ్డలో

పూడికల తొలగింపు



దుగ్గేరు సమీపంలోని అడారుగెడ్డలో జేసీబీతో చెత్తను తొలగిస్తున్న దృశ్యం



గెడ్డలో రాళ్లు, చెత్తను తొలగించడంతో కాజ్‌వేపై తగ్గిన వరదనీరు

మక్కువ:

మండలంలోని పనసభద్ర పంచాయతీ, దుగ్గేరు, మెండంగి గ్రామాల సమీపంలోని అడారు గెడ్డలో రాళ్లు, చెత్తను జేసీబీ సహాయంతో సర్పంచ్ సీదరపు గంగమ్మ చొరవ చూపించి తొలగింపజేశారు. గెడ్డలో పెద్ద,పెద్ద రాళ్లతో పాటు, చెట్లుకొమ్మలు ఉండడంతో, గెడ్డపై నిర్మించిన కాజ్‌వే పైపుల వద్ద వరదనీరు సక్రమంగా ప్రవహించక, కాజ్‌వేపై నుంచి వరదనీరు ప్రవహించేది. కాజ్‌వేపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో, గెడ్డకు రెండువైపులా విద్యుత్‌స్తంభాలకు తాళ్లు(పడుగు) కట్టి, ఆ సహాయంతో గెడ్డను దాటేవారు. సర్పంచ్ గంగమ్మ శుక్రవారం గెడ్డలో రాళ్లు, చెట్లుకొమ్మలు తొలగింప చేయడంతో కాజ్‌వేపై నుంచి వరదనీరు ప్రవహించకుండా, పైపుల ద్వారా నీరు ప్రవహించడంతో గిరిజనులు రాకపోకలను సజావుగా సాగించారు. సర్పంచ్ గంగమ్మ చూపించిన చొరవకు సుమారు 25గ్రామాలకు చెందిన గిరిజనులు హర్షం వ్యక్తజేశారు.